




అనంతపురంలో సిలిండర్లను మోస్తూ నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు కార్యకర్తలు

నిరసనాగ్రహం

గ్యాస్ ధరల పెంపుపై జిల్లా వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో నిరసనాగ్రహం వ్యకం అయ్యింది. పెంచిన గ్యాస్ సిలిండర్ల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ అనంతపురంతో పాటు పలు మండలాల్లో నిరసన ర్యాలీలను చేపట్టారు.

వార్త 6లో

ఆసరా టోకరా



◆ అందని మూడోదఫా ఆసరా సాయం

◆ నాలుగేళ్లలో రెండుసార్లతో సరిపుచ్చిన ప్రభుత్వం

◆ రుణమాఫీ కోసం మహిళల ఎదురుచూపు

ఆడబిడ్డలకు ఆసరాగా ఉంటానని, అన్నగా కష్టనష్టాల్లో తోడుగా ఉంటానని ఎన్నికల సమయంలో నాడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు నాలుగు విడతల్లో రుణమాఫీ చేస్తానని అట్టహాసంగా ప్రకటించారు. అయితే మూడో విడత చెల్లించాల్సి వచ్చేసరికి ప్రభుత్వం వాయిదాలతో దాటవేత ధోరణి ప్రదర్శిస్తుస్తోంది. అక్టోబర్‌లో చెల్లిస్తామన్న రుణమాఫీ గురించి నాలుగు నెలలైనా దాని గురించి ఎలాంటి ప్రకటనా చేయలేదు. ప్రభుత్వం ఆ ఊసే ఎత్తలేదు. ఒక్క తాడిపత్రి మండలంలోనే 7613 మందికిపైగా డ్వాక్రా మహిళలు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. ఎన్నికల కోడ్ పేరుతో నాలుగో విడతకు ప్రభుత్వం ఎగనామం పెట్టేందుకే ప్రభుత్వం ఇలా మూడో విడత పంపిణీని ఆలస్యం చేస్తోందనే వాదనలు వినిపిస్తున్నాయి.



ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

డ్వాక్రా మహిళలకు చెల్లించాల్సిన రుణమాఫీని చెల్లించకుండా ప్రభుత్వం వాయిదా వేస్తున్నట్లు తెలుస్తోంది. 2022లో ప్రకటించాల్సిన మూడో విడత రుణమాఫీని 2023 వచ్చినా ఇప్పటివరకు ప్రకటించకుండా లబ్ధిదారులకు టోకరా ఇస్తోంది. 2019 ఏప్రిల్ 11లోపు డ్వాక్రా మహిళలకు ఉన్న రుణాలన్నింటినీ మాఫీ చేస్తానని ఇప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల హామీ ఇచ్చారు. అప్పటికే రుణాలు చెల్లించి ఉంటే వారు చెల్లించిన మొత్తాన్ని తిరిగి చెల్లిస్తానని ప్రకటించారు. ఎన్నికల్లో గెలిచిన 15 నెలల వరకూ ప్రభుత్వం ఈ హామీ అమలుకు పూనుకోలేదు. 2019 మే చివర్లో అధికార పగ్గాలు చేపట్టిన ముఖ్యమంత్రి 2020 సెప్టెంబర్ వరకూ పథకం ఊసే ఎత్తలేదు. దీంతో డ్వాక్రా మహిళల్లో తీవ్ర సంతప్తి నెలకొంది. ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. తప్పని పరిస్థితుల్లో ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పేరుతో రుణమాఫీ పథకాన్ని 2020 సెప్టెంబర్ 11న ప్రారంభించింది. తాడిపత్రి మండలంలో 1115 గ్రూపులు ఉండగా వాటిలో 756 గ్రూపులను అర్హులుగా గుర్తించి వారికి రూ. 250.35 కోట్ల మేర రుణమాఫీ కింద ఇవ్వాలని నిర్ణయించి నాలుగు విడతల్లో ఇచ్చేందుకు నిర్ణయించింది. తొలివిడత మండలంలోని 7613 మందికి ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు రూ. 125.18 కోట్లు పంపిణీ చేశారు. రెండో విడత ఒక నెల ఆలస్యంగా 2021 అక్టోబర్ 7న మరో రూ.6.48 కోట్లు పంపిణీ చేశారు.

మూడో విడత ఎప్పుడు?

2022లో అమలు చేయాల్సిన మూడో విడత రుణమాఫీ గురించి ఇప్పటివరకు ప్రభుత్వం మాట్లాడటం లేదు. నిజానికి కిందటేడాది సెప్టెంబరు, అక్టోబరుల్లోనే మూడో విడత రుణమాఫీ అమలు జరగాలి. కానీ అక్టోబర్ పోయి నాలుగు నెలలు కావస్తున్నా ప్రభుత్వం దాని ఊసే ఎత్తలేదు. 2023 జనవరిలో విడుదల సంక్షేమ క్యాలెండర్‌లో జనవరిలో ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం మార్చి నెల వస్తున్నా ఇప్పటికీ కూడా ప్రకటించలేదు. తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వంకతో మరో వాయిదా వేసేందుకు సిద్ధమైందని సమాచారం. లబ్ధిదారుల జాబితా సిద్ధం చేసి సచివాలయాల వద్ద ప్రదర్శనకు పెట్టడం మినహా మూడో విడత రుణమాఫీకి సంబంధించి ఇప్పటివరకు జరిగింది ఏమీ లేదు.

నాలుగో విడత ఎగవేత కోసమేనా.?

నాలుగో విడత పథకంపై లబ్ధిదారులు అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. మూడో దపా మార్చిలో ఇచ్చినా నాలుగో దఫా పథకం 2024 కి మారిపోతుంది. 2024 ఏప్రిల్‌లో ఎన్నికలు ఉండడంతో ఏడాది ప్రారంభం నుంచే కోడ్ అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. కోడ్ పేరుతో నాలుగో విడతకు ప్రభుత్వం ఎగనామం పెట్టేందుకే ఇలా వాయిదాలు వేసుకుంటూ వస్తోందన్న అనుమానం లబ్ధిదారుల్లో వ్యక్తం అవుతున్నాయి.

తాడిపత్రిలో 7613 మంది ఎదురుచూపు

తాడిపత్రి మండలంలో మూడో దఫా ఆసరా కింద 756 గ్రూపులకు చెందిన 7613 మందికి 125.18 కోట్లు రూపాయలు రావాల్సి ఉందని అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం మండలంలో 7613 మందికి పైగా రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారని తాజా గణాంకాలు చెబుతున్నాయి.

17 నుంచి జిల్లాలో యువగళం

◆ కదిరి నుంచి పాదయాత్ర మొదలు

◆ 40 రోజుల పాటు ఉమ్మడి జిల్లాలో లోకేశ్ పాదయాత్ర

◆ విజయవంతం చేయడంపై టిడిపి నేతల సమావేశం



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పేరుతో గత నెలలో ప్రారంభించిన పాదయాత్ర ఈ నెల 17వ తేదిన సత్యసాయి జిల్లాలోకి ప్రవేశించనుంది. కదిరి నియోజక వర్గంలోకి ప్రవేశించిన తరువాత 40 రోజుల పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలో లోకేశ్ పాదయాత్ర ఉండనున్నట్ట పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ యాత్ర రూట్ మ్యాప్‌తోపాటు ఏ రకంగా విజయవంతం చేయాలన్న దానిపై జిల్లా టిడిపి నేతలతోపాటు, పార్టీ పరిశీలకులుగానున్న మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రవీంద్రలు గురువారం నాడు కదిరలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సత్యసాయి జిల్లా పార్టీ అధ్యక్షులు బికె.పార్థసారధి, పిఎసి ఛైర్మన్ పయ్యావుల కేశవ్, మాజీ మంత్రులు పల్లె రఘునాథరెడ్డి, పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, కందికుంట వెంకట ప్రసాద్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాదయాత్ర రూట్ మ్యాప్‌పైనా ప్రాథమికంగా చర్చించినట్టు తెలుస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 నియోజకవర్గాలుంటే మడకశిర, కళ్యాణదుర్గం, రాయదుర్గం మినహా తక్కిన అన్ని నియోజకవర్గాల్లో పాదయాత్ర కవర్ చేసే విధంగా ప్రణాళిక చేసినట్టు తెలుస్తోంది. నియోజకవర్గానికి కనీసం మూడు రోజులు యాత్ర కొనసాగే విధంగా చూస్తున్నారు. కదిరిలో వారం రోజులుగా జరుగుతున్న వివాదం నేపథ్యంలో ఈ యాత్ర అక్కడి నుంచి ప్రారంభం కానుండటంతో పెద్దఎత్తున పాదయాత్రకు స్పందన లభించే విధంగా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్న యోచనలో పార్టీ నేతలున్నారు.

తెలుగుదేశం పార్టీకి ఉమ్మడి అనంతపురం జిల్లాకు పెట్టని కోట వంటిది. అయితే 2019 ఎన్నికల్లోనే గతంలో ఎన్నడూలేనంత ఎక్కువగా దెబ్బతింది. 14 నియోజకవర్గాల్లో కేవలం రెండు చోట్ల మాత్రమే గెలుపొందింది. 12 నియోజకవర్గాల్లో ఓటమిని చవి చూసింది. ఆ పార్టీ ఇంతటి ఘోర ఓటమిని జిల్లాలో ఎన్నడూ చూడలేదు. ఈ ఎన్నికల్లో దెబ్బతిన్నాక పార్టీ కార్యకర్తల్లో నిరుత్సాహం నెలకొంది. స్థానిక సంస్థల్లోనూ ఇదే రకంగా దెబ్బతింది. వెనకబడిన తరగతులు పార్టీకి వెన్నుదన్నుగా ఉండేవారు. కాని ఇటీవలి కాలంలో వెనుకబడిన తరగతుల ఓటింగ్ చెదిరిపోతున్నట్టు కనిపిస్తోంది. వారు వైసిపి వైపు కూడా మొగ్గు చూపుతుండటంతో టిడిపి దెబ్బతినడానికి కారణమవుతోందన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో వ్యక్తమవుతోంది. ఇప్పుడు లోకేశ్ పాదయాత్ర ద్వారా చెదిరిన బిసి ఓటరును సమీకరించే ప్రయత్నం చేస్తారా అన్నది చర్చనీయాంశంగా ఉంది. అదే విధంగా సీనియర్లుగానున్న నేతల మధ్యనున్న విభేదాలు కూడా పార్టీని బలహీనపరుస్తున్నాయి. ఓటమి తరువాత కూడా ఆ పార్టీలో గ్రూపు రాజకీయాలు తగ్గడం లేదు. వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో లోకేశ్ పాదయాత్ర జిల్లాలో 40 రోజుల పాటు నడవనుండటంతో అటు ప్రజల్లోకి వెళ్తూనే, పార్టీని బలపరుచుకోవడంపైనా లోకేశ్ దృష్టి సారిస్తారా అన్న చర్చ టిడిపి క్యాడర్‌లో సాగుతోంది. ఈ యాత్రకు వచ్చే స్పందన ద్వారా ఆ పార్టీకి రాబోయే రోజుల్లో భవిష్యత్తు ఏ రకంగా ఉండనుందన్న అంచనాకూ రావచ్చునని పార్టీ పరిశీలకులు భావిస్తున్నారు.

పకడ్బందీగా కౌంటింగ్ ఏర్పాట్లు

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల పట్టభద్రుల ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత అధికారులను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. జేఎన్టీయూలో ఏర్పాటు చేయనున్న కౌంటింగ్ సెంటర్‌ను గురువారం ఉదయం జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డిఆర్ఓ గాయత్రీదేవిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బ్యాలెట్ బాక్స్‌ల భద్రత, స్ట్రాంగ్ రూమ్ ఎంపిక, ఓట్ల లెక్కింపునకు అవసరమయ్యే గదులు, అక్కడ వసతుల ఏర్పాట్లు, బ్యారికేడింగ్ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికలకు సంబంధించి సామగ్రి పంపిణీ, రిసెప్షన్, షామియాన, బ్యారికేడింగ్, మెస్‌ల ఏర్పాట్లు, వెహికల్ పార్కింగ్‌కు తదితర సంబంధించిన పనులను ప్రణాళికా బద్ధంగా చేపట్టాలన్నారు. ఎన్నికల్లో పట్టభద్రుల నియోజకవర్గం నుంచి 49 మంది అభ్యర్థులు బరిలో ఉన్నందున బ్యాలెట్ పేపర్లు లెక్కించి వేసేందుకు ట్రేల పరిమాణం, కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు కూర్చునేందుకు సరిపడా స్థలం తదితర అంశాలను పరిగణలోనికి తీసుకుని ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందన్నారు. స్ట్రాంగ్ రూమ్ నందు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. కౌంటింగ్ హాల్లో సరైన క్రమంలో టేబుల్స్, ఫెన్సింగ్, రెండు వైపులా రాకపోకలు ఉండేలా ఏర్పాటు చేయాలని, చీఫ్ ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన సూచనలు మేరకు కౌంటింగ్ సక్రమంగా జరపాలని సంబంధిత అధికారులకు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లో బందోబస్తు, గార్డ్‌ల ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. దాంతో పాటుగా రెవెన్యూ అధికారులకు కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, భోజనవసతి కల్పించేందుకు తగినచర్యలు తీసుకోవాలని డిఎస్ఒకు సూచించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీవో మధుసూదన్, జేఎన్టీయూ ప్రిన్సిపల్ సుజాత, మున్సిపల్ కమిషనర్ భాగ్యలక్ష్మి, ఆర్అండ్‌బి ఎస్ఈ ఓబుల్ రెడ్డి, ఈఈ ప్రసాద్ రెడ్డి, డిఈ బాల కాటమయ్య, తహాశీల్దార్ శ్రీధర్ మూర్తి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



కౌంటింగ్ కేంద్రంలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

రైలు వంతెన కింద లారీ బోల్తా...

రాయదుర్గం : పట్టణంలోని బైపాస్ రోడ్డు వద్ద ఉన్న రైలు వంతెన కింద గురువారం ఓ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఇనుప గరండాలు తీసుకెళున్న లారీ రైలు వంతెన కిందికి వెళ్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. జాతీయ రహదారి వద్ద రైలు వంతెన పూర్తి కాకపోవడంతో సరుకుల రవాణా లారీలు బైపాస్ రోడ్డు వద్ద ఉన్న రైలు అండర్ బ్రిడ్జి కింది నుంచి వెళున్నాయి. అయితే ఈ దారిలో నీరు నిలబడి పెద్ద పెద్ద గోతులు ఏర్పడటంతో తరచూ సరకు రవాణా వాహనాలు అదుపుతప్పి బోల్తా పడుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రోడ్డు మరమ్మతులు చేసి ప్రమాదాలు జరగకుండా నివారించాలని కోరుతున్నారు.



రైల్వే వంతెన కింద రోడ్డుకు అడ్డంగా బోల్తా పడిన లారీ

నిరవధిక విద్యుత్ సరఫరా కోసం రైతుల వినతి

రాయదుర్గం : వ్యవసాయబావులకు నిరవధికంగా విద్యుత్ సరఫరా చేయాలని పట్టణ పరిధిలోని బీటీపీ రోడ్డు ప్రాంతంలో ఉన్న రైతులు ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించారు. ఈమేరకు గురువారం పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పట్టణ పరిధిలోని బిటిపి రోడ్డు ప్రాంతంలో బోరుబావుల కింద సుమారు 100 మంది రైతులు మొక్కజొన్న, వేరుశెనగ తదితర పంటలు సాగు చేస్తున్నారు. అయితే ఈ ఫీడర్ కింద విద్యుత్ నిరవధికంగా, నాణ్యంగా సరఫరా చేయకపోగా రాత్రిళ్లువిద్యుత్ సరఫరా చేస్తున్నారన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటం వల్ల పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. అంతేగాకుండా రాత్రిళ్లు పొలాల్లోని బోరు బావి మోటార్ పెట్టడానికి వెళ్తే అడవి పందులు, చిరుతలు, ఎలుగుబంట్ల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. కావున పగటిపూట నాణ్యమైన నిరంతర విద్యుత్తును సరఫరా చేయాలని కోరారు.



ట్రాన్స్‌కో అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు



మృతిచెందిన కొల్లారప్ప, మహేష్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

డి.హీరేహాల్ : మండల పరిధిలోని బాదనహాల్ గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మురడి గ్రామానికి చెందిన కొల్లారప్ప (45), బళ్లారికి చెందిన మహేష్ (43) బంధువులు. ఇద్దరూ కలిసి గ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. బాదనహాల్ సమీపంలోకి రాగానే రాయదుర్గం నుంచి బళ్లారి వైపు వెళ్తున్న టిప్పర్ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రామకృష్ణారెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాలను రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పిఆర్‌కె కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోండి: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యార్థులకు ప్రాక్టికల్స్ సాకుగా చూపి వసూళ్లకు పాల్పడుతున్న పిఆర్‌కె కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నగరంలోని పిఆర్‌కె కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతుర్ పరమేష్ మాట్లాడుతూ పిఆర్‌కె కళాశాల యాజమాన్యం విద్యార్థుల నుంచి వేల రూపాయలు ప్రాక్టికల్స్ రూపంలో వసూళ్లకు పాల్పడుతోందన్నారు. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థుల నుంచి ప్రాక్టికల్స్ పేరుతో అధిక మార్కులు వేయిస్తామంటూ యాజమాన్యం డబ్బులు వసూలు చేసిందన్నారు. అనేక సార్లు ఆర్ఐఓకు చెప్పిన ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలకు తొత్తుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల చదువులను గాలికి వదిలేసి పట్టి పట్టినట్టుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కావున ఆర్ఐఓ సురేష్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సూర్యప్రకాష్, చంద్ర, ఆదర్శ్, వలి, రంజిత్ విద్యార్థి తల్లి దండ్రులు కష్టవేణి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బాగా చదివి ఉత్తీర్ణత సాధించాలి

అనంతపురం : బాగా చదివి ఉత్తీర్ణత సాధించాలని బిసి వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి విద్యార్థులకు సూచించారు. గురువారం జిల్లా బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నగరంలోని బీసీ స్టడీ సర్కిల్లో అనంతపురం డివిజన్ పరిధిలోని బిసి హాస్టల్స్‌లోని పదో తరగతి విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ శాఖ డిడి కుష్బూ కొఠారి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్స్‌లోని విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. వారికోసం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. గత ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తగ్గిందని ఈసారి వంద శాతం ఉత్తీర్ణత కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఏబీసీడబ్ల్యూవో సుభాషిని, బీసీ హాస్టల్ వార్డెన్లు మారుతి ప్రసాద్, కంబయ్య, నాగరాజు, గోవింద్ రెడ్డి, ఠాగూర్, నాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

శెట్టూరు : మండలంలోని అడవిగొల్లపల్లి ప్రాథమిక పాఠశాలను ఎంఇఓ వి.శ్రీధర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి విద్య సామర్థ్యాలను పరిశీలించారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనం చేసే తీరును పరిశీలించారు. భోజనంలోకి వాడే కూరగాయలు, సామగ్రిని పరిశీలించి వంట నిర్వాహకులు, ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

6న అరుణాచలం యాత్రకు ప్రత్యేక బస్సు

రాయదుర్గం : ఈనెల 6వ తేదీన సాయంత్రం రాయదుర్గం నుంచి అరుణా చలానికి ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ కె.సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులో ప్రయాణించు యాత్రికులు అరుణాచలం వెళ్లి రావడానికి రాయదుర్గం నుంచి ఒక్కొక్కరికి రూ.1,950, కళ్యాణ దుర్గం నుంచి అరుణాచలం వెళ్లి రావడానికి రూ.1,790 ఛార్జీ వసూలు చేయనున్నట్లు తెలిపారు. యాత్రికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాడె మోసిన విప్ కాపు

మాజీ జడ్పిటిసి మృతికి నివాళి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని బల్లలగుడ్డం గ్రామానికి చెందిన మాజీ జెడ్పిటిసి నల్లారెడ్డి మృతికి విప్ కాపు రామచంద్రారెడ్డి గురువారం నివాళులర్పించారు. నల్లారెడ్డి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బళ్లారిలో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న విప్ కాపు నల్లారెడ్డి స్వగ్రామం బల్లలగుడ్డంకు చేరుకుని పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాడె మోశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నాగిరెడ్డి, మాజీ ఎంపిపి రాజగోపాల్‌రెడ్డి, మాజీ ఎంపిపి లాలుసాబ్, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాడె మోస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా

శింగనమల : నాగులగుడ్డం తండా గ్రామంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతుండడాన్ని గమనించిన తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఆయన సేవాభావం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల కష్టాలు తీర్చే నాయకులకు అండగా ఉంటామని నాగలగుడ్డం తండా ప్రజలు పేర్కొంటున్నారు.

పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించాల్సిందే

భారాలు మోపే మోడీ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు
సిపిఎం ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్లతో నిరసన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

గ్యాస్ వినియోగదారులకు ఇబ్బందులు కలిగిస్తూ పెంచిన గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉప సంహరించుకోవాలని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం గ్యాస్ ధరల పెంపుదలను నిరసిస్తూ సిపిఎం నగర 1వ కమిటీ ఆధ్వర్యంలో క్రాంతి ఆసుపత్రి సర్కిల్ నుంచి శ్రీకంఠం సర్కిల్ వరకు గ్యాస్ సిలిండర్లను భుజాలపై మోసుకుంటూ రోడ్డుపై కట్టెల పొయ్యిలు వెలిగించి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గృహ వినియోగానికి ఉపయోగించే ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ రూ.50, వాణిజ్య సిలిండర్ రూ.350 చొప్పున పెంచడం దుర్మార్గం అన్నారు. దీన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఒక వైపు నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటి సామాన్య ప్రజలు దుర్భరమైన పరిస్థితులు ఎదుర్కొంటుంటే, మరో వైపు గ్యాస్ ధరలు రెండు నెలల వ్యవధిలో రెండు సార్లు పెంచడం దారుణమన్నారు. 6 సంవత్సరాల క్రితం వరకు రూ.417 ఉన్న డొమెస్టిక్ గ్యాస్ సిలెండర్ ధర నేడు రూ.1175కు పెరిగిందన్నారు.



గుంతకల్లులో నిరసన తెలుపుతున్న ఐద్వా మహిళలు

ప్రభుత్వం సబ్సిడీ వేయడం రెండు సంవత్సరాల నుంచి నిలిపివేసిందన్నారు. ఇప్పటికే గృహ వినియోగానికి సబ్సిడీ కింద ఇచ్చే సిలిండర్ల సంఖ్య కుదించారని తెలిపారు. ఇది పూర్తిగా పేద, మధ్యతరగతిపై దాడి తప్ప మరొకటి కాదన్నారు. వాణిజ్య సిలిండరు ఒక్కసారిగా రూ.350 పెంచడం వల్ల స్వయం ఉపాధి పొందుతున్నవారు, చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ఆర్థిక మాంద్యం వల్ల చితికిపోతున్న స్వయం ఉపాధి మరింత దుర్భరస్థితికి చేరుకుంటుందని తెలిపారు. ఉపాధి లేక, వేతనాలు చాలక, ద్రవ్యోల్బణం పెరిగిపోతున్న నేపథ్యంలో ధరలు నియంత్రించాల్సిన ప్రభుత్వం మూలిగే నక్కపై తాటి పండు పడ చందంగా భారాలు మోపడం సరికాదన్నారు. మరోవైపు కార్పొరేట్లకు రాయితీలిచ్చి దేశాన్ని దోచిపెడుతున్నారన్నారు. వంట గ్యాస్ ధరల పెంపును ఉపసంహరించి, సబ్సిడీని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

శ్రీశ్రీ నగర్‌లో..

గ్యాస్ ధరల పెంపును వ్యతిరేకిస్తూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శ్రీశ్రీ నగర్‌లోని కాలనీవాసులు ఇళ్ల ముందు సిలిండర్లను పెట్టి గరిటెలతో శబ్దాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు నరేంద్ర మోడీ అవలంబిస్తున్న విధానాలను తీవ్రంగా



అనంతపురంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

వ్యతిరేకించారు. రాష్ట్రంలో ఉన్న రాజకీయ పార్టీలు నరేంద్ర మోడీ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని, ప్రజల పక్షం వహించాలని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు ప్రకాష్, వలి, మసూద్, వెంకటనారాయణ, ప్రసాదు, బాలకృష్ణ, వెంకటేశు, ఎన్టీఆర్ శీనా, శివ, రామాంజి, ఇస్మాయిల్, డేవిడ్, ఆనంద్, సురేష్, వలి, శ్రీశ్రీ నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

గుంతకలు : కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని ఐద్వా పట్టణ అధ్యక్షురాలు బి.జ్యోతి డిమాండ్ చేశారు. వంట గ్యాస్ ధరల పెంపుదలను వ్యతిరేకిస్తూ ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం నిరసన తెలిపారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి లేనిపక్షంలో ఐద్వా, ఇతర ప్రజా సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పౌరుల సంఘం నాయకులు మారుతి ప్రసాద్, సిఐటియు నాయకులు సాకే నాగరాజు, చిరు వ్యాపారస్తుల సంఘం నాయకులు తిమ్మప్ప, ఐద్వా నాయకులు వన్నురమ్మ, శారదా, మాబీ, గిరిజమ్మ, హుస్సేన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

సిఎం జగన్‌కు ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో లేఖ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లాకు తలమానికంగా ఏర్పాటు చేసిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, ప్రత్యేక పాలక వర్గం ఏర్పాటు చేయాలని అనంత ప్రజా ఆరోగ్య వేదిక నేతలు డిమాండ్ చేశారు. గురువారం ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని కలిసి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ పంపాలని అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంత ప్రజా ఆరోగ్య వేదిక అధ్యక్షులు డాక్టర్ కొండయ్య, కార్యదర్శి పి.శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ ప్రసూన, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎజి.రాజమోహన్ తదితరులు హాజరై మాట్లాడుతూ అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ప్రత్యేక బడ్జెట్‌తో పాటు ప్రత్యేక పాలనా యంత్రాంగం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సంస్థ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రి నిర్వహణలో తగినంత నిధులు లేకుండా పని చేస్తున్నందున, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి అవసరమైన నిధులు లేకుండా ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. మానవ వనరులు లేకుండా ఈ సంస్థ ఇబ్బందులకు గురవుతుండటం సరికాదన్నారు. వెనుకబడిన ప్రాంతాల్లోని నిరుపేదలకు ఆరోగ్య సంరక్షణ అందించడానికి ఈ ఆసుపత్రికి చాలా అవకాశాలు ఉన్నాయన్నారు. ఉత్తమమైన సేవలు అందించే అడ్మినిస్ట్రేటివ్ సెటప్ ప్రత్యేక బడ్జెట్ ద్వారా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెలలో బడ్జెట్ సమర్పణకు గడువు



ఎమ్మెల్యే అనంతకు లేఖను అందజేస్తున్న దృశ్యం

ఉన్నందున ఈ డిమాండ్‌ను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సకాలంలో పరిశీలించాలని ఎమ్మెల్యే అనంతకు విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ప్రత్యేక క్యాజువాలిటీ ఓపిని ఏర్పాటు చేసి అన్ని విభాగాలు సక్రమంగా పనిచేసేలా రిక్రూట్‌మెంట్ చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం కో-కన్వీనర్ ఎంఎన్‌టి.రాజు, జెవివి నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దవడుగూరులో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

ఆడపిల్లల చదువు సమాజానికి ఉపయోగం

ప్రజాశక్తి-ఉరవకొండ

రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వెంకటేష్ చిన్నముష్టూరు వద్ద నున్న మోడల్ స్కూల్ విద్యార్థులకు బేటీ బచావో..బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గురువారం ఆయన మోడల్ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రశస్య కుమారితో కలసి వైద్యాధికారి మాట్లాడారు. సమాజంలో ఆడపిల్లల ప్రాముఖ్యత, ఆడా మగ సమానత్వం గురించి వివరించారు. ఆడపిల్లలకు విద్య యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. చదువు మధ్యలో ఆపివేయడం వల్ల బాల్య వివాహాలకు అవకాశం ఉందని తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎమ్‌డి షఫీ, సిహెచ్ఒ నాగరంగయ్య మాటాడుతూ.. ఆడ పిల్లల పట్ల లైంగిక వేధింపులు, లైంగిక దాడులు, పోక్సో, దిశ చట్టం గురించి అవగాహన కల్పించారు. బాలికల చదువు, వివాహ సమయంలో ఆర్థిక అవసరాల కోసం ఉపయోగపడే బాలికా సమృద్ధి యోజన పథకం గురించి వివరించారు. పుట్టిన ప్రతి అమ్మాయి ఈ పథకంలో చేరాలని సూచించారు. ఈ నెల 8వ తేదీన మహిళా దినోత్సవం వరకు పాఠశాలలు, కళాశాలల్లో బేటీ బచావో..బేటీ పడావో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎంఎల్‌హెచ్‌పి హిమబిందు, హెల్త్ అసిస్టెంట్ రఘు, కమ్యూనిటీ ఆర్గనైజర్ భగవాన్‌దాస్, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : మహిళలు అన్ని రంగాల్లో సమానత్వం కలిగి ఉండాలని, ప్రభుత్వాలు మహిళలకు అన్ని అవకాశాలూ కల్పిస్తున్నాయని ఆరోగ్యం కేంద్రం వైద్యులు శ్రీనివాసబాబు సూచించారు. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కస్తూర్భాగాంధీ బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమం గురించి వివరించారు. దిశ, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యావకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. విద్య, క్రీడలు, మహిళా చట్టాలు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో కెజిబివి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ లక్ష్మీదేవమ్మ, సిహెచ్ చిట్టితల్లి, ఆరోగ్య విస్తరణాధికారి వినయ్, పిహెచ్ఎన్ హేమలత, సూపర్‌వైజర్ శ్రీనివాసులు, అంగన్‌వాడీ కార్యకర్త సంజీవమ్మ, మహిళా కానిస్టేబుల్ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా పనులు చేస్తే అడ్డుకుంటాం

ప్రజాశక్తి-అనంతపురం

వార్డు సభ్యుల అనుమతి లేకుండా, వారికి తెలియకుండా వార్డుల్లో ఏక పక్షంగా పనులు చేస్తే అడ్డుకుంటామని రుద్రంపేట ఉప సర్పంచి నరేంద్రరెడ్డి, వార్డు సభ్యులు తెలిపారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. గురువారం పంచాయతీ సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండడం వల్ల దాన్ని వాయిదా వేయాలని కోరారు. పంచాయతీలో సర్పంచి భర్త పెత్తనం ఎక్కువైందని, ఆయన ప్రమేయం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

సర్పంచిపై చర్యలు తీసుకోవాలి

సర్పంచి తమను తాగి పంచాయతీ సమావేశాలకు వస్తున్నారని ఫిర్యాదు చేశారని ఆమెపై చర్యలు తీసుకోవాలని ఉప సర్పంచితో పాటు పది మంది వార్డు మెంబర్లు కార్యదర్శిని కోరారు. ఇక నుంచి డ్రంకెన్ పరీక్షలు నిర్వహించాకే సమావేశంలోకి సభ్యులను అనుమతించాలన్నారు. లేదంటే ఆరుబయటే సమావేశం నిర్వహించాలని సెక్రటరీకి సూచించారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-ఉరవకొండ

గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి రథోత్సవాన్ని పురస్కరించుకొని ఉరవకొండ పట్టణంలో ఎస్‌కెఆర్ క్లబ్ వారు నిర్వహించిన జిల్లాస్థాయి షటిల్ కాక్ టోర్నమెంటులో గెలుపొందిన క్రీడాకారులకు స్థానిక క్లబ్బులో గురువారం బహుబమతులు అందజేవారు. ఉరవకొండ రూరల్ సిఐ బి.శేఖర్, ఎస్ఐ వెంకటస్వామి చేతుల మీదుగా నగదు బహుమతితో పాటు షీల్డ్ అందజేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎస్‌కెఆర్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించడం హర్షణీయం అన్నారు. ఈ పోటీలు క్రీడాకారుల్లో మానసికోల్లాసాన్ని, స్నేహ సంబంధాలను పెంచుతాయని చెప్పారు. మూడు రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో 30 టీములు పాల్గొన్నాయన్నారు. అనంతపురానికి చెందిన షటిల్ కాక్ క్రీడాకారులు అత్యంత ప్రతిభను కనబరిచి మొదటి, రెండవ బహుమతులను కైవసం చేసుకున్నారని తెలిపారు. క్లబ్ కార్యదర్శి శివప్ప, ఉపాధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ ఎస్‌కెఆర్ క్లబ్ తరఫున అనేక సేవా కార్యక్రమాలతో పాటు క్రీడలనూ ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రథోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సిఐటియు బోర్డును తొలగించిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-తాడపత్రి రూరల్

మండల పరిధిలోని చిన్న పడమల గ్రామం వద్ద రహదారి పక్కన ఉన్న సిఐటియు బోర్డును తొలగించిన వారిని కఠినంగా శిక్షించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టి ఎస్ఐ గౌస్ మొహమ్మద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ.. మండల పరిధిలోని చిన్న పడమల గ్రామం వద్ద 2022 ఆగస్టు 15న ఉద్యోగ సంఘాలు, ఆశా, అంగన్‌వాడీ మధ్యాహ్న భోజనం, స్వచ్ఛభారత్ పలు సంఘాలు చిన్న పడమల గ్రామానికి వెళ్లే రహదారి పక్కన ఏర్పాటు చేసుకున్న సిఐటియు బోర్డును గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం తొలగించారన్నారు. సిఐటియు ఏనాడూ రాజకీయాలు చేయకుండా ఉద్యోగ, కార్మికుల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం మాత్రమే పోరాడుతోందన్నారు. అలాంటి సంఘం బోర్డును తొలగించడం దుర్మార్గమన్నారు. బోర్డు తొలగించిన వ్యక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగన్మోహన్ రెడ్డి, హనుమంతరెడ్డి, బాల చౌడయ్య, నాగరాజు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత గ్రామ కార్యదర్శిపై చర్యలు చేపట్టాలి

గుత్తి : సమాచార హక్కు చట్టం పేరుతో తమను బెదిరిస్తూ, వేధింపులకు పాల్పడుతున్న విశ్రాంత పంచాయతీ కార్యదర్శి రమేష్‌రెడ్డి పై చర్యలు చేపట్టాలని మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ శరత్‌చంద్ర, టిపిఎస్ అబ్దుల్ సత్తార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్యలు డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు మూకుమ్మడిగా గురువారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. రమేష్‌రెడ్డి పై సిఐ ఎం.వెంకటరామిరెడ్డికి ఫిర్యాదు చేశారు.

నేరాలు ఘోరాలు

హుండీల్లో నగదు చోరీ

పెద్దవడుగూరు : పెద్దవడుగూరు మండలం చింతలచెరువు గ్రామంలో ప్రసిద్ధి చెందిన జోడి లింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. హుండీలను పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం ఆలయానికి వెళ్లిన అర్చకులు వీరేష్‌కు హుండీలు పగులగొట్టి ఉండడం కనిపించింది. చోరీ జరిగిందని నిర్ధారించుకుని ఆయన పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆలయంలో సిసి కెమెరాలు రెండురోజుల నుంచి సరిగా పనిచేయకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు వాటిని పగులగొట్టి నగదు దోచుకెళ్లారని స్థానికులు చెప్పారు. తెలిసిన వారే చోరీకి పాల్పడివుంటారని పోలీసులకు తెలిపారు. ఆలయ అర్చకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. త్వరలో దొంగలను పట్టుకుంటామని ఎస్ఐ పేర్కొన్నారు.

40 ఎకరాల్లో దానిమ్మ తోట దగ్ధం

బొమ్మనహాల్ : మండలంలోని ఎల్బీనగర్ సమీపంలో విద్యుత్ వైర్ల షార్ట్ సర్క్యూట్ కారణంగా దాదాపు 40 ఎకరాల్లో దానిమ్మతోట పూర్తిగా దగ్ధమైంది. బాధిత రైతులు తెలిపిన వివరాల మేరకు.. ఎల్బీనగర్‌కు చెందిన రైతులు బెల్లంకొండ వెంకటేశ్వరరావు, వాసు, గురు శివప్రసాద్‌తోపాటు మరో మహిళా రైతుకు సంబంధించిన దానిమ్మ తోటపై విద్యుత్ వైర్లు వెళ్లాయి. ఈనేపథ్యంలో గురువారం సాయంత్రం వైర్లు ఒకదానికి ఒకటి రాసుకుని నిప్పులు చెలరేగాయి. ఆ నిప్పులు పంటపై పడటంతో పంట పూర్తిగా దగ్ధమైనట్లు బాధిత రైతులు వాపోయారు. పంటతోపాటు డ్రిప్పు పరికరాలు, పైపులు కాలిపోయాయన్నారు. దానిమ్మ తోట పిందెలు పడిన సమయంలో కాలిపోవడంతో సుమారు రూ.50లక్షల వరకూ నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ఎస్‌ఎఫ్‌ఐ ప్రచారం

గుత్తి : పశ్చిమ రాయలసీమ నియోజకవర్గానికి పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిల గెలుపు కోసం గుత్తి పట్టణంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సిఎస్ఐఆర్‌డి ఎంబిఎ కళాశాల ఎంఎస్ డిగ్రీ కళాశాలతో పాటు పలు ప్రయివేటు కళాశాలలు, పాఠశాలల్లో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయులు పిడిఎఫ్ అభ్యర్థులైన పోతుల నాగరాజు, కత్తి నర్సింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, గౌతమ్ నాయక్, నాయకులు శివ నాయక్, రవి నాయక్, సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి రూ.16 లక్షలు మంజూరు

పుట్లూరు : జలజీవన్ మిషన్ పథకం కింద ప్రతి ఇంటికీ, ప్రభుత్వ కార్యాలయాలకు మంచినీటి సరఫరా కోసం రూ.16 లక్షలు మంజూరైనట్లు ఎంపీడీవో యోగానందరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని వాటర్ ట్యాంకును పరిశీలించారు. ఇప్పటికే శనగలగూడూరు గ్రామంలో ఏర్పాటు చేసిన సంప్ నుండి పుట్లూరు మండల కేంద్రంని మోడల్ స్కూలులో ఉన్న సంప్, ఒహెచ్ఎస్ఆర్ లకు నీరు సరఫరా అవుతోందన్నారు. అక్కడి నుండి పుట్లూరు గ్రామంలోని అన్ని గృహాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు తాగునీరు సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ ఆనందప్రసాద్, సర్పంచి ఓబులేష్, పంచాయతీ కార్యదర్శి సరోజ, ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నాయుడు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం

గార్లదిన్నె : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ నీల్లపాల వెంకటనారాయణ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, సర్పంచులు ఎంపిటీసీలు హాజరయ్యారు. గ్రామాల్లో సమస్యలపై ప్రజా ప్రతినిధులు అధికారులను నిలదీశారు. నీటి వసతి, జగనన్న ఇళ్ల నిర్మాణాలు, బిల్లులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఉషారాణి, ఇఒఆర్‌డి వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ రామ్మోహన్‌రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే పెద్దారెడ్డి

పెద్దపప్పూరు : తనకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజల సంక్షేమమే తన ధ్యేయమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే పెద్దారెడ్డి మూడవ రోజు ప్రజా సంక్షేమ యాత్ర పెద్దపప్పూరు మండలం పరిధిలోని వెంగంపేట, నరసాపురం, పెండేకల్లు గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో అవ్వా తాతలకు ఇంటి వద్దకే వెళ్లి పింఛను అందిస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలంటే మరొకసారి జగనన్న ప్రభుత్వం రావాలన్నారు. జగనన్న ప్రభుత్వంలో మరోసారి ప్రజలు తనకు సేవ చేసే భాగ్యం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి రమాదేవి, జాతీయ ఉపాధి హామీ పథకం మెంబర్ వేమనాథరెడ్డి, ఎంపిపి రామ్మూర్తిరెడ్డి, ఉపాధ్యక్షులు రామయ్య, నారాయణస్వామి దేవస్థానం ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, శివారెడ్డి, తురకపల్లి లక్ష్మిరెడ్డి, ముచ్చుకోట అమర్నాథ్‌రెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు ఉచిత శిక్షణ

నార్పల : శివకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు నార్పల మండల కేంద్రంలో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ఈ శిక్షణ తరగతులు మార్చి 3వ తేదీ నుండి ఏప్రిల్ 23వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. 4వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు లగినేని నాగరాజు 781599010, గంగి పుల్లయ్య 9493881973, బాబా ఫకృద్దీన్ 9908204240, కొండిశెట్టి ప్రవీణ్‌కుమార్ 9000223224 సెల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆడపిల్లలను చదివిద్దాం..వివక్షను నిర్మూలిద్దాం..

బుక్కరాయసముద్రం : ఆడపిల్లలను చదివిద్దాం..వివక్షను నిర్మూలిద్దామని బుక్కరాయసముద్రం ప్రభుత్వ వైద్యాధికారిని డాక్టర్ స్వాతిలక్ష్మి అన్నారు. మహిళా దినోత్సవం వారోత్సవాల సందర్భంగా స్థానిక కేజీబీవీ స్కూల్ నందు వైద్యాధికారి డాక్టర్ స్వాతిలక్ష్మి అధ్యక్షతన గురువారం మహిళా సదస్సు నిర్వహించారు. సమాజంలో ఆడపిల్లల ప్రాముఖ్యత, లింగ నిష్పత్తిపై అవగాహన కల్పించారు. లింగ నిర్ధారణ చట్టం, పోక్సో, దిశా చట్టం, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. సిహెచ్ఒ మోహన్‌రావు, పిహెచ్ఎన్ చెన్నమ్మ, సూపర్‌వైజర్లు బి.ఈశ్వరమ్మ, డి.ఈశ్వరమ్మ, ఎఎన్ఎం అంజనమ్మ, ఎంఎల్‌హెచ్‌పి జయంతి, కేజీబీవీ కళాశాల ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పంపనూరు శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు

ఆత్మకూరు : పంపనూరు సమీపంలోని కొండపైన ఉన్న శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం ధ్వజారోహణం, కళశ స్థాపన, కళశారాధన, హోమం నిర్వహించారు. 3 తేదీ నృసింహస్వామి మూలమంత్ర హవనము, కళశారాధన, హోమం, 4న నృసింహ సుదర్శన హోమం, కళశారాధన హోమం, 5న లక్ష్మీ హోమం, గరుడోత్సవం, 6న రాత్రి 10 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ నృసింహస్వామి కల్యాణోత్సవం, 7న ఉదయం మడుగుతేరు, సాయంకాలం రథోత్సవం, 8న పరుష, అర్ధరాత్రి 12 గంటలకు పార్వేట ఉత్సవం నిర్వహిస్తారు. ఈ బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి అభిషేకం నిర్వహిస్తారు. 9న కళశారాధన, వసంతోత్సవం, మహాపూర్ణాహుతి, కుంభ ఉద్వాసన, సాయంకాలం ధ్వజావరోహణ కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి ఉత్సవ మూర్తులను వై.కొత్తపల్లి ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళతారు. అంతటితో బ్రహ్మోత్సవాలు పూర్తవుతాయి.

5న ఉచిత కంటి వైద్య శిబిరం

ఉరవకొండ : ఉరవకొండలోని విశ్రాంత ఉద్యోగుల భవనం నందు సుశీల నేత్రాలయ, సాయి ఎడ్యుకేషన్ సొసైటీ వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఈనెల 5వ తేదీన నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షులు కె.క్రిష్టప్ప తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య శిబిరానికి వచ్చేవారు తప్పనిసరిగా హెల్త్ కార్డు తీసుకురావాలన్నారు. ఈ వైద్య శిబిరానికి సంబంధించి ఎవరికైనా సందేహాలు ఉంటే 9989039099 ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చన్నారు.